నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్

5 | నిజామాబాద్, ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | ADILABAD


# నేడే భీమన్న జాతర

## గజాలతో గోదావరిలో పుణ్య స్నానాలు



ఊరేగింపులో భీమన్న గజాలతో ముదిరాజ్ కమిటీ సభ్యులు

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 24 : ఖానాపూర్ మండలంలోని రాజురా గ్రామంలో భీమన్న ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కాగా.. శనివారం గంగ స్నానానికి బయలుదేరారు. ఆదివారం భీమన్న పండుగ, జాతర అత్యంత వైభవంగా జరుగనుంది. మారుమూల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. కాగా.. శనివారం భీమన్న విగ్రహంతో పట్టణంతోపాటు పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలను ఆచరించి, గజాలకు గోదావరి జలాలతో అభిషేకం చేశారు. తిరిగి కాలినడకన స్వగ్రామానికి వెళ్లి పండుగను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో లింగన్న, చిలుకలయ్య, భీమేశ్, భీమరాజు, బుచ్చన్న, ధర్మరాజు, నరేశ్, భీమన్న పాల్గొన్నారు.

# కల్యాణం కమనీయం

## కనులపండువగా వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవం

తాళిబొట్టును చూపిస్తున్న వేద పండితులు



నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 24 : నిర్మల్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 34వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా కొనసాగింది. వేద పండితులు బాజాభజంత్రీలతో వేడుకలను నిర్వహించగా.. మహోత్సవానికి పట్టణంతోపాటు చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జై కుమ్రం భీం అంటూ నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# జోడేఘాట్‌లో భీంకు నివాళులర్పించిన తొలి సీఎం కేసీఆర్

● ఆయన చరిత్రలో నిలిచిపోతారు.. ● మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఫిబ్రవరి 24 : ఎన్నడూ లేని విధంగా జోడేఘాట్‌కు వచ్చి కుమ్రం భీంకు నివాళులర్పించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పేర్కొన్నారు. శనివారం బేల మండలంలోని మసాల గ్రామంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా వారితో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాడిన ఆదివాసీ పోరాటయోధుడు కుమ్రం భీం ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ ప్రభుత్వం ఆదివాసీ సంక్షేమానికి తొలి ప్రాధాన్యతను ఇచ్చిందని గుర్తు చేశారు. పదవీ ఉన్నా లేకపోయినా చేసిన మంచి పనులు ఎప్పటికీ నిలిచిపోతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మనోహర్, గంభీర్ ఠాక్రే, కల్యం ప్రమోద్‌రెడ్డి, సతీశ్ పవార్, ఆడె శంకర్, తన్వీర్ ఖాన్, బండి సుదర్శన్, బత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

# నూతన హంగులతో బల్దియా

● అందుబాటులోకి వచ్చిన సేవలు ● మూడు అంతస్తుల్లో భవన నిర్మాణం

● వివిధ శాఖలకు ప్రత్యేక గదులు ● రూ.3.50 కోట్లతో నిర్మించిన కేసీఆర్ ప్రభుత్వం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ) : పట్టణంలోని వినాయక్ చౌక్ ప్రాంతంలో గల పాత మున్సిపాలిటీ ఎదురుగా నిర్మించిన నూతన బల్దియా భవనం అన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేసుకున్నది. పాత భవనం పగుళ్లు తేలడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కేసీఆర్ ప్రభుత్వం కొత్త భవనాన్ని నిర్మించింది. గతంలో మున్సిపాలిటీలో 36



చైర్మన్ గదిలో ఫర్నిచర్



కొత్త మున్సిపాలిటీ భవనం

వార్డులు ఉండగా పునర్విభజనలో భాగంగా ఆదిలాబాద్ రూరల్, మావల మండలంలోని పలు గ్రామాలను విలీనం చేయడంతో వార్డుల సంఖ్య 49కి పెరిగింది. బల్దియా పరిధి పెరగడంతో జనం తాకిడి అధికమైంది. దీంతో కొత్త భవనం నుంచి సేవలు ప్రారంభమయ్యాయి.

### రూ.3.50 కోట్లతో నిర్మాణం

కొత్త మున్సిపాలిటీ భవన నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. 2017లో పనులు ప్రారంభం కాగా రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులను పర్యవేక్షించారు. మూడు అంతస్తుల్లో జీ ప్లస్ 3 భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రజాసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఫస్ట్ ఫ్లోర్‌లో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ గదులను ఏర్పాటు చేశారు. దీంతోపాటు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు ఉంటాయి. రెండో అంతస్తులో ఇంజినీరింగ్ విభాగాలు, అకౌంట్స్, మెప్మా, శానిటరీ సెక్షన్లకు సంబంధించిన గదులు ఉంటాయి. మూడో అంతస్తులో మున్సిపల్ సర్వసభ్య సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్ కోసం సువిశాలమైన గదులను నిర్మించారు. పాత భవనం నుంచి వివిధ శాఖల విభాగాలను సంబంధించిన ఫర్నిచర్, ఫైళ్లు, కంప్యూటర్‌లను కొత్త భవనంలోకి తరలించారు. భవనానికి బయట రంగులు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



లక్ష్మీనారాయణ స్వామి పాదాలను తాకిన సూర్య కిరణాలు

# స్వామి వారి పాదాలను తాకిన కిరణాలు

## దర్శనానికి తరలివస్తున్న భక్తులు

జైనథ్, ఫిబ్రవరి 24 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. శనివారం వేకువజామున లేలేత కిరణాలు నేరుగా స్వామి వారి పాదాలపై ప్రసవించాయి. దీంతో స్వామి వారు బంగారు వర్ణంలో శోభాయమానంగా వెలుగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 14వ శతాబ్దంలో పల్లవులు, జైనుల కాలంలో నిర్మించిన అతి ప్రాచీనమైన ఆలయంలో యేటా స్వామి వారి పాదాలను అభిషేకించడం జరుగుతున్నదని పూజారులు తెలిపారు. ఈ ఆలయానికి సూర్య నారాయణస్వామి అనే మరో పేరు ఉంది. స్వామి వారి పాదాలపై సూర్యకిరణాలు పడ్డ దృశ్యాన్ని భక్తులు వీక్షిస్తే తాము అనుకున్నది జరుగుతుందని ప్రగాఢ నమ్మకం. కిరణాలను దర్శించుకునేందుకు యేటా వేలాది మంది భక్తులు హాజరై తమ మొక్కులు తీర్చుకుంటారు.

# అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఎదులాపురం, ఫిబ్రవరి 24 : ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా సురేందర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్)గా పనిచేసి బదిలీపై అదనపు ఎస్పీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వెళ్లారు. మళ్లీ జిల్లాకు అదనపు ఎస్పీ(ఆపరేషన్స్)గా వచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. సురేందర్‌రావును వర్టికల్ డీఎస్పీ శ్రీనివాస్, కార్యాలయ ఏవో భక్త ప్రహ్లాద్, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.




ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తున్న నారాయణ మహారాజ్

# హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి..

## సనాతన ధర్మ సేవా సమితి సమ్మేళన సభలో నారాయణ మహారాజ్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 24 : హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నారాయణ మహారాజ్ అన్నారు. శనివారం సాయినగర్‌లో జెండాను ఊపి సనాతన ధర్మ సేవా సమితి భవ్య దివ్య భారీ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ భారీ శోభాయాత్రను అందునాయక్ తండా వరకు సాగింది. అనంతరం కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసే ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటునకు భూమిపూజ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్వాలాముఖి దేవి ఆలయంలో పూజలు నిర్వహించి సనాతన ధర్మ సేవా సమితి సమ్మేళన సభలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలతోపాటు హిందూ ధర్మ రక్షణపై ప్రవచించారు. ఈ కార్యక్రమంలో మహారాజ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ సల్లకుండలను ఎత్తుకుని ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

# సల్లకుండలను ఎత్తుకుని..

*నిర్మల్ మండలంలోని ముజ్గి మల్లన్న జాతర మూడో రోజు వైభవంగా కొనసాగింది. శనివారం సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు సల్లకుండలను ఎత్తుకుని మల్లన్న స్వామికి నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. యేటా ఫిబ్రవరి మాసంలో నిర్వహించే ఈ మల్లన్న జాతరకు జిల్లా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.*

*- సోన్, ఫిబ్రవరి 24*



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

**- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 24 : పది, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానుండగా.. 23 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 13,345 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పది తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని.. 47 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ద్వారా బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్, డీఆర్వో లింగయ్య, మేనేజర్ నదీం, డీఎస్పీ గంగారెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, ఆర్డీవో రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.





హాజరైన ప్రజలు,పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా, కలెక్టర్ రాహుల్‌రాజ్

# ఖైదీల ఉపాధికే పెట్రోల్ బంక్‌లు

**రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా**

ఎదులాపురం, ఫిబ్రవరి 24 : ఖైదీలకు జీవనోపాధి కల్పించేందుకే పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని జిల్లా జైలు ఆవరణలో భారత్ పెట్రోలియం సహకారంతో ఏర్పాటు చేసిన బంక్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్యమిశ్రా మాట్లాడుతూ.. జైళ్ల శాఖలో ఆధ్వర్యంలో ఇది 30వ పెట్రోల్ బంక్ అని పేర్కొన్నారు. ఖైదీలకు ఉపాధి కల్పించడమే కాకుండా.. వారు విడుదలైన తర్వాత కూడా బంక్‌లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని గుర్తు చేశారు. తద్వారా వారు నేరప్రవృత్తికి దూరంగా ఉండేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫిజన్స్ మురళిబాబు, రాష్ట్ర జైళ్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ సంపత్, జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి పి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను పటిష్టంగా నిర్వహించాలి

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 24 : పల్స్ పోలియో కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో గంగయ్య, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



వాన్వాట్ గ్రామంలో హీరాసుక చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి రామన్న

# కేసీఆర్ హయాంలోనే ఆలయాలకు పెద్దపీట

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : ఆలయాల నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్వాట్‌లో హీరాసుక జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. హీరాసుక చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కచ్‌కంటి గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, నేటి తరాలకు స్ఫూర్తిని ఇచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహకాన్ని అందించిందన్నారు. ఎంపీపీ గంద్రత్ రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు, మాజీ ఎంపీపీ సేవ్వ జగదీశ్, ఎంపీటీసీ బుచ్చన్న, శుక్‌లాల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఊశన్న పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. బజార్‌హత్నూర్-సోనాల మధ్య గల కోల్హారి గ్రామ ప్రధాన రహదారి మధ్యలో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.3.20 కోట్లతో మెరుగైన వంతెన నిర్మిస్తామని తెలిపారు. అనంతరం రూ.8 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు, కోల్హారి గ్రామంలో రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ శంకర్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుమల, జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, బీఆర్‌ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు గజ్జయ్య, కానిందె ఉద్ధోవ్, రమణ, రమేశ్, మల్లేశ్, పాండురంగ్, విలాస్, భోజన్న, జనార్దన్, వినోద్, సాయన్న, రియాజ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్‌లో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

గుడిహత్నూర్, ఫిబ్రవరి 24 : గుడిహత్నూర్ మండల కేంద్రంలోని శివాలయంలో లోక కల్యాణార్థం మిట్టపల్లి రాజమ్మ-రాజయ్య దంపతుల మనవలు, మనవరాళ్ల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం మండల కేంద్రంలోని మహంకాళి మందిరంలో ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ జాదవ్ సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీల, మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జి.తిరుమల్‌గౌడ్, ఎంపీటీసీ షగీర్‌ఖాన్, బీఆర్‌ఎస్ నాయకులు పవార్ రవి, సుధాకర్‌రెడ్డి, రమేశ్ జాదవ్, ముండె సంజీవ్, జాదవ్ భీంరావ్ నాయక్, కేంద్రె వెంకట్‌రావ్, ఎండీ గఫార్, మాధవ్, గిత్తె గజానంద్, జమీల్, తగరే ప్రకాశ్, కేంద్రె మాధవ్, ప్రతాప్ రాథోడ్, మిట్టపెల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నమో వేంకటేశా..

## గోవిందుడి నామస్మరణతో మారుమోగిన గంగాపూర్ జాతర

రెబ్బెన, ఫిబ్రవరి 24 : గంగాపూర్ గ్రామ శివారులో బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర అంగరంగ వైభవంగా సాగుతున్నది. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం రెండో రోజూ భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచేకాకుండా పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉదయం 4 గంటల నుంచే స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఇక రథోత్సవం కనుల పండువగా నిర్వహించగా, గోవిందుడి నామస్మరణతో భక్తజనం పులకించి పోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



గంగాపూర్ జాతరకు తరలివస్తున్న భక్తులు